క్లుప్తంగా

500 మందికి మహా అన్నదానం



అన్నదానం ప్రారంభిస్తున్న నాయకులు

కొమ్మాది: జీవీఎంసీ 6వ వార్డు కే1 కాలనీ గుర జాడనగర్‌లో శ్రీ కనకదుర్గమ్మ, ఎల్లమ్మ, నాగులమ్మ ఆలయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం 500 మందికి మహా అన్నదానం ఏర్పాటు చేశారు. ముందుగా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ అవతార్‌సింగ్, పైడిరాజు పాల్గొన్నారు.

'వరం' సేవలు మరువలేనివి



వరం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మధురవాడ: మధురవాడ పాంత సీనియర్ నాయకుడు పోతిన వరం వర్ధంతిని చంద్రంపాలెంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. బాపూజీ కళామందిరం వద్ద వరం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ నగరాలు కులస్తుల సంక్షేమానికి వరం చేసిన సేవలు, వారిని బీసీ జాబితాలో చేర్చేందుకు చేసిన కృషి మరువలేమన్నారు. సింహాచలం దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పోతిన జోగి, పోతిన వెంకటరమణ, పిల్లా లక్ష్మణ, పిల్లా సూరిబాబు, పిల్లా చంద్రశేఖర్, కుడితి రామారావు, పిల్లా పోతురాజు, జగ్గుపిల్లి అప్పారావు, జగ్గుపిల్లి నరేష్, జగ్గుపిల్లి నాని, పిల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



దెబ్బతిన్న కారు ముందు భాగం

కొమ్మాది: బీచ్ రోడ్డులో పెను ప్రమాదం తప్పింది. రుషికొండ నుంచి వైజాగ్ వెళ్తున్న ఓ కారు అతివేగంతో రాడిసన్ బ్లూ సమీపంలో డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కారు బోల్తా పడి టైర్ పేలి ముందు భాగం నుజ్జు నుజ్జయింది. అయితే ఆ సమయంలో ఆ మార్గంలో ఇతర వాహనాలు ఏవీ రాకపోవడంతో ఎవరికీ ప్రమాదం జరగలేదు. విషయం తెలుసుకున్న ఆరిలోవ పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు.

రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు గుడిలోవ విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన్ విహార్ పాఠశాల విద్యార్థులు షూటింగ్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గత నెల 30న విశాఖలో నిర్వహించిన జూనియర్స్ విభాగం పోటీల్లో 9వ తరగతి విద్యార్థులు అఖిల్, వరహా ధనుంజయ్, సంజయ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి 15 మంది గల జిల్లా జట్టులో స్థానం సంపాదించారు. ఈ నెల 12, 13న నెల్లూరులో రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా తరపున ఆడనున్నారు. ఈ మేరకు పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించింది.

వేములవలసలో జనంతో జనసేన

ఆనందపురం : వేములవలసలో మంగళవారం జనంతో జనసేన కార్యక్రమం నిర్వహించారు. ఆ పార్టీ భీమిలి నియోజకవర్గం సమన్వయకర్త పంచకర్ల సందీప్ పాల్గొని మాట్లాడారు. ముందుగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీవీ కృష్ణ, చంద్రరావు, నాయుడు, శీనుబాబు పాల్గొన్నారు.

ముస్తాబైన మహిళా మార్ట్

- డ్వాక్రా సంఘాల సభ్యులే నిర్వాహకులు
- పొదుపు సొమ్మే పెట్టుబడిగా నిర్వహణ



ఆకర్షణీయంగా ఉన్న మార్ట్ లోపలి భాగం



ఆనందపురంలో నిర్మించిన చేయూత మహిళా మార్టు భవనం

ఆనందపురం : మహిళలే నిర్వాహకులుగా ఏర్పాటు చేసిన చేయూత మహిళా మార్టు ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. మండలంలో గల డ్వాక్రా మహిళలందరూ తమ పొదుపు సొమ్మే పెట్టుబడిగా ఈ మార్ట్‌ని ఏర్పాటు చేసుకుని స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సమీపంలో పోలీస్ స్టేషన్ పక్కన మార్ట్‌ని ఏర్పాటు చేశారు. అందులో అన్ని నిత్యావసర సరకులతోపాటు డ్వాక్రా మహిళలు తయారు చేసిన తిను బండారాలను విక్రయానికి అందుబాటులో ఉంచుతారు.

అంతా మహిళల పర్యవేక్షణలోనే...!

చేయూత మహిళా మార్టులో వస్తువుల కొనుగోలు నుంచి అమ్మకాల వరకు అంతా మహిళల పర్యవేక్షణలోనే జరగనుంది. మండలంలో 1,520 డ్వాక్రా గ్రూపులు ఉండగా అందులో 15,240 మంది సభ్యులు ఉన్నారు. ఒక్కొక్క సభ్యురాలు రూ.460 చొప్పున సమకూర్చారు. అందులో రూ.300 పెట్టుబడిగా, రూ.160 బిల్డింగ్ ఫండ్‌గా వినియోగించారు. మహిళా మార్ట్ నిర్మాణం, వస్తువుల కొనుగోలుకు సుమారు రూ.65 లక్షలు వెచ్చించారు. దీంతో కార్పొరేట్ సంస్థల మార్ట్‌లను తలదన్నే విధంగా తయారు చేశారు. వస్తువుల అమరికకు అరలు, కొనుగోలుదారులు వస్తువులు తరలించుకోవడానికి ట్రాలీలు, బకెట్లు కూడా ఏర్పాటు చేశారు. మార్ట్ నిర్వాహణ ద్వారా వచ్చే లాభాల్లో నిర్వహణ ఖర్చులు తీసేసి మిగతా మొత్తాన్ని పెట్టుబడి పెట్టిన సభ్యులందరికీ సమానంగా పంచుతారు. మహిళా మార్టు ముందు భాగాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేశారు. ఖాళీ ప్రదేశంలో గడ్డి పెంచి మొక్కలు ఏర్పాటు చేశారు. కొనుగోలుదారుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటు చేస్తున్నారు.

అందుబాటులో నిత్యావసర సరకులు

మహిళా మార్ట్‌లో నిత్యావసర సరకులన్నింటినీ అందుబాటులో ఉంచుతాము. బియ్యం, పప్పు దినుసులు, ఇంట్లో నిత్యం వాడుకునే వస్తువులు మార్ట్‌లో లభ్యమవుతాయి. బయట మార్కెట్ కంటే తక్కువ ధరకు అందించే ఏర్పాట్లు చేస్తున్నాం. తిను బండారాలు, ఇతర వస్తువులు తయారు చేసే డ్వాక్రా మహిళలు సంప్రదిస్తే వారికి గుర్తింపునిచ్చి వారి వస్తువులను విక్రయించడానికి స్టాళ్లలో పెడతాం. బ్యాంకుల ద్వారా రుణాలు అందించడానికి కృషి చేస్తాం. వారం రోజుల్లో మార్టు ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నాం.

– నాగభూషణరావు, ఏపీఎం, ఆనందపురం.

ఎందరు కలిసొచ్చినా వైఎస్సార్‌సీపీదే విజయం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



చిప్పాడలో మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

తగరపువలస: రానున్న ఎన్నికల్లో చంద్రబాబు, పవన్ కలిసి వచ్చినా... మరో నలుగురిని తోడు పెట్టుకుని వచ్చినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధిస్తుందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం సాయంత్రం భీమిలి మండలం చిప్పాడ పంచాయతీలో సర్పంచ్ వెంపాడ రమావతి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు రూ.17.50 లక్షలతో నిర్మించిన వెల్‌నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికులు తన ముందు ఉంచిన చిప్పాడ వీధిలోని డ్రైనేజీ, రహదారి సమస్య నెల రోజుల్లో పరిష్కరిస్తామన్నారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇప్పటికే పంచాయతీ పరిధిలోని ఐదు గ్రామాలకు ఇచ్చామని, మరో రెండు గ్రామాల్లో త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. వీధి దీపాలు పూర్తి స్థాయిలో వెలిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి ఈ నాలుగేళ్లలో సంక్షేమ పథకాలకు సంబంధించి రూ.5 లక్షలు పొందిన చిల్ల వెంకటలక్ష్మి, రూ.5.72 లక్షలు పొందిన చిల్ల అప్పలనరసమ్మ, రూ.4.90 లక్షలు పొందిన సరగడ ఈశ్వరమ్మ తదితరులు సీఎం జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఎమ్మెల్యే ఎదుట ప్రస్తావించగా... వాటి పరిష్కారానికి సచివాలయ సిబ్బంది, అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ దాట్ల పెదబాబు, ఎంపీపీ దంతులూరి వాసురాజు, జెడ్పీటీసీ సభ్యుడు గాడు వెంకటప్పడు, వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు, మండల సచివాలయాల కన్వీనర్ సరగడ రఘునాథరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గాడు శ్రీను, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వెంపాడ సూరిబాబు, సరగడ రాంబాబు, సమ్మిడి శ్రీనివాసరావు, చెల్లూరి నగేష్, పాట్నూరు చంద్రశేఖర్, జీవీ నారాయణ, తుపాకుల అప్పలరాజు, శిరిగుడు ఈశ్వరరావు, బొడ్డు దుర్గారావు, తోట ఎల్లారావు, కేపీ సత్యనారాయణ, గిడిజాల రమణ, సాడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు ప్రారంభం

కొమ్మాది: ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి తల్లిపాలు అత్యంత ఉపయోగకరంగా నిలుస్తాయని, తల్లిపాల సంస్కృతిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని గీతం వైద్యురాలు టి.లక్ష్మమ్మ సూచించారు. విశ్వవిద్యాలయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అండ్ రీసెర్చ్ ఆస్పత్రి ప్రాంగణంలో తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఆమె మాట్లాడారు. బిడ్డ పుట్టిన తర్వాత తల్లి నుంచి మూడు రోజులపాటు అందే తల్లిపాలు చిక్కగా, పోషక పదార్థాలతో ఉంటాయని, వాటిని అందించడం ప్రయోజనకరమని తెలిపారు.

లార్వా నియంత్రణకు చర్యలు

తగరపువలస: జీవీఎంసీ మలేరియా నివారణ బృందం మంగళవారం గెడ్డలో లార్వా ఉన్నచోటును గుర్తించి రసాయనాలు పిచికారీ చేశారు. ఇటీవల వర్షాలకు నీరు ఒక చోటు నుంచి మరోచోటకు ప్రవహించేటప్పుడు లార్వా ప్రయాణిస్తుందని వారు తెలిపారు. తగరపువలస – భీమిలి రోడ్డులో చిల్లపేట, జీరుపేట తదితర గ్రామాల వద్ద నిల్వ నీటిలో లార్వా ఉండటాన్ని గమనించారు. పారిశుధ్య సిబ్బంది సాయంతో ఆయా ప్రదేశాల్లో రసాయనాలు పిచికారీ చేయించారు.

గంజాయి మత్తులో జోగుతున్న 12 మందికి రిమాండ్

పీఎం పాలెం: గంజాయి మత్తులో జోగుతున్న 12 మందిని పీఎం పాలెం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఇందుకు సంబంధించి స్థానిక సీఐ వై.రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ... విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం రాత్రి మారికవలస రాజీవ్ గృహకల్ప కాలనీలో గంజాయి రవాణా చేస్తున్న లక్ష్మణ, కృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి కేజీన్నర గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం వారు ఇచ్చిన సమాచారంతో దేవీమెట్ట ప్రాంతంలో గంజాయి సేవిస్తున్న అనిల్ కుమార్, నరసింహారావు, శెట్టి, భవానీ ప్రసాద్, మహమ్మద్ ఇర్ఫాన్, వెంకటేష్, శ్రీను, నరేష్, బెహరాతోపాటు మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి చిన్నచిన్న గంజాయి ప్యాకెట్లు, 7 ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించామని సీఐ వై.రామకృష్ణ తెలిపారు.

రోడ్డు పక్కన గాయాలతో యువతి

కొమ్మాది: తిమ్మాపురం నుంచి మారికవలస వెళ్లే మార్గ మధ్యలో ఓ యువతి స్వల్ప గాయాలతో రోడ్డు పక్కన స్పృహ తప్పి పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బీచ్ రోడ్డు తిమ్మాపురం రోడ్డులో వాటర్ ట్యాంక్ సమీపంలో మంగళవారం సాయంత్రం ఓ యువతి స్వల్ప గాయాలతో, చిరిగిన దుస్తులతో రోడ్డు పక్కన పడి ఉంది. ఆమె స్నేహితులు ఎవరితోనైనా వచ్చిందా..? లేక ఎవరైనా కొట్టి ఇక్కడ పడేశారా..? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. నడుము, చేతులపై గాయాలు ఉన్నాయి. చేతిపై పచ్చబొట్లు ఉన్నాయి. సాయంత్రం ఇటుగా వాకింగ్‌కు వెళ్తున్న పలువురు ఆమెను చూసి 108 అంబులెన్స్, పోలీసులకు సమాచారం అందించడంతో వారు చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ఆ అమ్మాయి నగరంలోని రెల్లివీధికి చెందిన వేణుకుమారిగా గుర్తించినట్లు సీఐ డి.రమేష్ తెలిపారు. ఆమె స్పృహలోకి వచ్చిన తర్వాత పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు.

రోడ్ల నిర్మాణాల పూర్తికి తక్షణ చర్యలు



నగరంపాలెం రోడ్డును పరిశీలిస్తున్న అధికారులు

మధురవాడ: మధురవాడ జోన్ కేంద్రంలో అసంపూర్తిగా ఉన్న నగరంపాలెం, రేవళ్లపాలెం రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి తక్షణ చర్యలు చేపడుతున్నట్టు వుడా, జీవీఎంసీ అధికారులు చెప్పారు. ఈ సందర్భంగా వుడా డీఈ తాతాజీ, జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ కూన వెంకటేశ్వరరావు ఆయా రోడ్లను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంపాలెం రోడ్డులో రెండు టీడీఆర్‌లు పెండింగ్ ఉన్నాయని, వాటిని వెంటనే క్లియర్ చేస్తామని తెలిపారు. దీనికి ఆయా స్థలాల యజమానులు సమ్మతి పత్రాలు ఇచ్చారన్నారు. దీంతో హైవే నుంచి సైక్లోన్ షెల్టర్ వరకు గల మొదటి ఫేస్ 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణానికి అన్ని ఆటంకాలు తొలగినట్టేనన్నారు. అలాగే రేవళ్లపాలెంలో ఒక కోర్టు కేసు ఉందని, రేవళ్లపాలెం గ్రామస్తుల టీడీఆర్‌లు పెండింగ్ ఉన్నాయన్నారు. ఈ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి రీ టెండర్లు పిలిచి పనులు చేపడతామని డీఈ తాతాజీ తెలిపారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ



విద్యార్థులకు స్టేషనరీ అందిస్తున్న ట్రస్టు సభ్యులు

పద్మనాభం: మండలంలోని ఆర్.వి.పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థులకు లీనా చారిటబుల్ ట్రస్టు నిర్వాహకులు సాడి కృష్ణవేణి, తోట శ్రీనివాస్ మంగళవారం స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింత మందికి సహాయం అందించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, తల్లిదండ్రుల కమిటీ ఎక్స్ ఆఫీషియో మెంబర్ మరగడ అప్పారావు, ఉపాధ్యాయులు కర్రోతు కృష్ణ, సీహెచ్.రవికుమార్ పాల్గొన్నారు.

మహిళ మెడలోని బంగారు తాడు అపహరణ




రోదిస్తున్న పైడిరాజుతో స్థానికులు

పద్మనాభం: మండలంలోని కృష్ణాపురం ఎస్సీ కాలనీ వద్ద మంగళవారం సాయంత్రం చైన్ స్నాచింగ్ జరిగింది. వివరాలిలా ఉన్నాయి. కృష్ణాపురం రెల్లి కాలనీకి సమీపంలో నివసిస్తున్న సురాల పైడిరాజు సాయంత్రం 4 గంటల సమయంలో మేకలు కాస్తున్న తన భర్త రమణకు టీ పట్టుకుని సమీపంలోని కొండ వద్దకు వెళ్లింది. భర్త లేకపోవడంతో పైడిరాజు టీ పట్టుకుని తిరిగి ఇంటికి బయలుదేరింది. ఈ క్రమంలో మార్గమధ్యలో కృష్ణాపురం కాలనీకి సమీపంలో పద్మనాభం – మహారాజుపేట రోడ్డుపై కల్వర్టు వద్ద అప్పటికే మాటు వేసి ఉన్న వ్యక్తి బైక్‌పై వెనుక నుంచి వచ్చి మెడలోని బంగారు తాడు తెంపుకుని పోయాడు. ఈ ఘటనతో హతాశురాలైన బాధితురాలు లబోదిబోమంటూ రోదిస్తోంది.

లారీ ఢీకొని ఒకరి మృతి

ఆనందపురం : మండలంలోని వేములవలస సమీపంలో ఆరు లైన్ల రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు స్థానిక పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ సత్యనారాయణ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మన్యం జిల్లా, వీరఘట్టం మండలం, హుస్సేన్ పురం గ్రామానికి చెందిన ఉమ్మడాల చంద్రమౌళి, అతని భార్య వెంకటలక్ష్మి 15 ఏళ్ల క్రితం ఉపాధి కోసం విశాఖనగరం వలస వచ్చారు. దుర్గానగర్‌లో ఉంటూ కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో వెంకట లక్ష్మి తండ్రికి అనారోగ్యంగా ఉండడంతో గత నెల 29న భార్యా భర్తలిద్దరూ స్కూటీపై హుస్సేన్‌పురం వెళ్లారు. వెంకటలక్ష్మి తండ్రి వద్దే ఉండిపోగా చంద్రమౌళి గత నెల 31న బయలుదేరి తిరిగి దుర్గానగర్ వస్తున్నాడు. అతను వేములవలస సమీపానికి చేరుకునే సరికి వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో చంద్రమౌళి (43) తూలి రోడ్డుపై పడడంతో తలకు బలమైన గాయమైంది. ఈ మేరకు అంబులెన్స్‌లో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. బంధువులు ఎవరూ సకాలంలో రాకపోయేసరికి కేజీహెచ్ శవాగారంలో మృతదేహాన్ని భద్రపరిచారు. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఏఎస్‌ఐ సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వీధి దీపాలు వెలగక అంధకారం



హరిజన సంతపేటలో చీకట్లో రోడ్డు మధ్యలో ఆవులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటో వార్డులోని గ్రామాల్లో అంధకారం అలుముకుంది. ముఖ్యంగా భీమిలి రోడ్డు నుంచి సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ మార్గంలో చిట్టివలస సప్తగిరి థియేటర్ వరకు వీధిదీపాలు వెలగడం లేదు. అలాగే జ్యూట్‌మిల్లు రహదారిలో రెడ్డివీధి, పెరికివీధి వరకు వీధిదీపాలు వెలగడం లేదు. చిట్టివలస మైలపల్లి వారి కళ్లాల నుంచి గోస్తనీనదిపై గుడివాడ వంతెన అప్రోచ్ రోడ్డు వరకు చీకటిగా ఉంటోంది. బొగ్గురోడ్డు చిట్టివలస నుంచి జీరుపేట వరకు, సుఖీభవ కాలనీలు చీకట్లో మగ్గుతున్నాయి. అలాగే జీవీఎంసీ రెండో వార్డు సంతపేట గొల్లవీధి నుంచి ఆదర్శనగర్ మార్గంలో హైవే వరకు వీధిదీపాలు వెలగడం లేదు. మరోవైపు వీధి దీపాలు వెలగకపోవడంతో ఇళ్ల ముందు నిలిపి ఉంచిన వాహనాలు, వాటి విడి భాగాలు అపహరణకు గురవుతుండడంతో పలువురు ఇబ్బంది పడుతున్నారు. చీకటి కారణంగా విష పురుగులు ఇళ్లలోకి ప్రవేశిస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. వెలగని వీధి దీపాలు వెంటనే పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం జగన్‌కు ఆత్మీయ స్వాగతం



విశాఖ నగర పర్యటనకు మంగళవారం విచ్చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందించి ఆత్మీయ స్వాగతం పలికారు.

– తగరపువలస

'అందుబాటులో ఉంచుతాం'

సాక్షి ఎఫెక్ట్..



టాయిలెట్స్‌ను పరిశీలిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు రుషికొండ ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పబ్లిక్ టాయిలెట్ ఉదయం ఒక పూట మాత్రమే తెరచి ఉంచడంపై సాక్షి పత్రికలో సోమవారం ప్రచురించిన వార్తకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి స్పందించారు. మంగళవారం ఆయన ఇక్కడి పబ్లిక్ టాయిలెట్‌ను పరిశీలించారు. ఇక నుంచి నిరంతరం అందుబాటులో ఉంచుతామని ఆయన తెలిపారు.

'ఉపాధి' పనుల్లో అవకతవకలపై చర్యలకు సిఫార్సు

ఆనందపురం : ఉపాధి హామీ పథకం నిధులతో 2022 – 2023 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల్లో సామాజిక తనిఖీలో బయటపడిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని ప్రజావేదికలో పాల్గొన్న అధికారుల బృందం నిర్ణయించింది. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం ఎంపీడీవో అడపా లవరాజు అధ్యక్షతన 16వ విడత సామాజిక తనిఖీపై ప్రజా వేదిక మంగళవారం నిర్వహించారు. డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ ఇ.సందీప్, విజిలెన్స్ అధికారి నిర్మలాదేవి, అంబుడ్స్‌మెన్ దొరబాబు హాజరయ్యారు. ముందుగా ఉపాధి హామీ పథకం సాంకేతిక సలహాదారు అల్లాడ తిరుమలరావు మాట్లాడుతూ మండలంలో 2022 – 2023 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో ఉపాధి హామీ, పంచాయతీ రాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, అటవీశాఖ తదితర 1,335 పనులకు వేతనాల కింద రూ. 13.18 కోట్లు, వస్తు సామగ్రి కింద రూ.1.86 కోట్లు చెల్లింపులు చేశామని వివరించారు. కొన్ని గ్రామాల్లో మస్తురులో దిద్దుబాట్లు, కొట్టివేతలు ఉన్నట్టు గుర్తించామన్నారు. తనిఖీలో బయటపడిన విషయాలపై సంబంధిత క్షేత్ర స్థాయి సిబ్బందిని సంజాయిషీ కోరి, అవసరమైతే చర్యలు తీసుకోవడానికి సభ్యులు నిర్ణయించారు. డ్వామా పీడీ సందీప్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వేతనదారులకు ఎక్కువ పనిదినాలు కల్పించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీడీ రాజారావు, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు, మండల ఇంజినీరు బట్టు వేంకటేశ్వర రావు పాల్గొన్నారు.

ఆలయాల్లో అధిక శ్రావణ పౌర్ణమి పూజలు



అన్నపూర్ణామాతకు అభిషేకం చేస్తున్న భక్తులు

మధురవాడ: అధిక శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని మధురవాడ పరిసర ప్రాంతాల్లో గల ఆలయాల్లో అమ్మవార్లకు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐటీ సెజ్ సమీపంలోని శ్రీ లలితా త్రిపుర సుందరీ సమేత మహా కామేశ్వర స్వామి ఆలయంలోని లలితా త్రిపుర సుందరీ దేవికి అధ్యక్షుడు బొడ్డేపల్లి సురేష్, ప్రతాపరాజు, జేడీ నాయుడు తదితరుల ఆధ్వర్యంలో... మధురవాడ అన్నపూర్ణాదేవీ సహిత సిద్ధేశ్వర దేవి ఆలయంలో అమ్మవారికి ప్రధాన అర్చకులు దూసి రామలింగశర్మ ఆధ్వర్యంలో పంచామృత అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు స్వహస్తాలతో అమ్మవార్లకు అభిషేకం చేసే అవకాశాన్ని కల్పించారు. పరిసర ప్రాంతాల భక్తులు విశేషంగా తరలివచ్చారు.

పంటకోత ప్రయోగాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి

పీఎం పాలెం: ఖరీఫ్ సీజన్‌లో విశాఖ జిల్లాలోని పెందుర్తి, ఆనందపురం, పద్మనాభం, భీమిలి మండలాల్లో వరి పంట కోత ప్రయోగాలపై వ్యవసాయ శాఖ మండల అధికారులు, సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కె.అప్పలస్వామి సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయంలో వైఎస్సార్ ఉచిత పంటల బీమా, ప్రధాన మంత్రి పసల్ యోజన పథకం కింద పంట కోత ప్రయోగాలపై మంగళవారం శిక్షణ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి కోత సమయంలో వివిధ ప్రాంతాల్లో గుర్తించిన పంట సేకరించి ధాన్యం దిగుబడిని అంచనా వేయవచ్చన్నారు. వ్యవసాయ శాఖ ప్రణాళిక అధికారి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలపై సిబ్బంది అలసత్వం వీడి, చిత్తశుద్ధితో పని చేయాలని సూచించారు. సహాయ గణాంక అధికారి బి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంగివలస పరిసర గ్రామాలకు ముంపు సమస్య



కృష్ణ కల్యాణ్ లే అవుట్‌లో నిలిచిన వర్షం నీరు



సంగివలస వద్ద సర్వీస్‌రోడ్డులో వర్షం నీరు

తగరపువలస: ఇటీవల కురిసిన వర్షాలకు సంగివలస చెరువు చుట్టూ ఉన్న గ్రామాలకు ముంపు సమస్య తొలగిపోలేదు. జాతీయ రహదారిని ఆనుకుని సర్వీస్ రోడ్డులో కూడా ఇప్పటికీ నీరు ఉండిపోవడంతో వాహనదారులు అందులో నుంచే రాకపోకలు సాగిస్తున్నారు. వాకింగ్ ట్రాక్ పేరుతో చెరువు ఇన్‌ఫ్లో ఎత్తు పెంచేయడంతోనే మొదటి నుంచీ ఇక్కడ సమస్య నెలకొంది. అలాగే చెరువు అవుట్ ఫ్లో తగ్గించకపోవడంతో దీని నుంచి నీరు పడమర దిశలో ఉన్న కృష్ణ కల్యాణ్ లే అవుట్‌లోకి ప్రవేశించి నిలిచిపోయింది. ఇటీవల జీవీఎంసీ చెరువు చుట్టూ తీసిన కచ్చా కాలువ కూడా వర్షాలకు చాలా వరకు పూడికపోయింది. శాస్త్రీయ పద్ధతిలో చెరువు అవుట్ లెట్, ఇన్‌లెట్‌లు సరిచేయకుండా చెరువు బయట డ్రైనేజీల తవ్వకం ద్వారా ప్రయోజనం లేదని ఇక్కడి రైతులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పలుమార్లు స్పందనలో ఫిర్యాదు చేశారు.

అధికారులకు ముందుచూపు లేకపోవడం, వివిధ విభాగాల మధ్య సమన్వయం లేకపోవడంతోనే కృష్ణ కల్యాణ్ లే అవుట్ ప్రస్తుతం ముంపు గుప్పిట్లో ఉందని వాపోతున్నారు. ఇక్కడి లే అవుట్ నుంచి వర్షం నీటిని బయటకు పంపేలా జీవీఎంసీ, ఇరిగేషన్ విభాగాల అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.